క్లుప్తంగా

ఘనంగా ఆరాధన ఉత్సవాలు

కామేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సద్గురు అవధూతేంద్ర సరస్వతి స్వామి 49వ ఆరాధన ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామికి పాదపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం స్వామి హరే రామ నామాన్ని సులభ శైలీలో విశ్వ వ్యాప్తంగా చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, పూజారి నరసింహశర్మ, నాగభూషణరావు, సైదులు, హనుమంతరావు, రమేష్, నగేష్, తిరుపతయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను కలిసిన శెట్టి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శెట్టి రంగారావు శనివారం నల్లగొండలో కలిసి అభినందనలు తెలిపారు. మల్లన్నను కలిసిన వారిలో నల్లగొండ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, పర్వత శ్రీనివాసరావు, గుడిపాటి లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన పైథాన్ శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీటీఐటీ కళాశాలలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పైథాన్ శిక్షణ శనివారం ముగిసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ విద్య కీలకంగా ఉన్న సమయాన పైథాన్ ప్రోగ్రామింగ్ అత్యంత కీలకమన్నారు.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: ఆగి ఉన్న బైక్‌ను మరో బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని ముచ్చర్లకు చెందిన బి.సైదులు తన ద్విచక్రవాహనంపై ముచ్చర్ల క్రాస్ రోడ్డు వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో సాతానిగూడెం స్టేజీ సమీపంలోని మూలమలుపు వద్ద తన బైక్‌ను పక్కను నిలిపి ఫోన్ మాట్లాడుతుండగా.. వెనుక వైపు నుంచి మరో ద్విచక్ర వాహనదారుడు మహబూబాబాద్ జిల్లా నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి వచ్చి ఢీకొట్టాడు. దీంతో సైదులు కాలు విరిగి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ పనుల అడ్డగింత



నేలకొండపల్లిలో పనులను అడ్డుకున్న ఎస్ఈ

నేలకొండపల్లి: అనుమతులు లేకుండా ఆర్‌అండ్‌బీ రహదారిని తవ్వకాలు చేపడుతుండడంతో ఆ శాఖ ఎస్.ఈ. శ్యామ్‌ప్రసాద్ మండిపడి పనులను నిలిపివేయించారు. నేలకొండపల్లి నుంచి రాజేశ్వరపురం వరకు బీఎస్‌ఎన్‌ఎల్ పైపులైన్ పనులు వేసేందుకు సదరు కాంట్రాక్టర్ జేసీబీలతో రహదారి తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ ఎస్.ఈ. శ్యామ్‌ప్రసాద్ నేలకొండపల్లి, కోనాయిగూడెం గ్రామాల మధ్య జరుగుతున్న పనులను శనివారం పరిశీలించి, అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎలా తవ్వకాలు చేపడతారని సదరు కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వెంటనే పనులు నిలిపివేయాలని, అనుమతులు వచ్చాక రహదారి, భవనాల శాఖ అధికారులు మార్కింగ్ ఇచ్చిన తరువాతే తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అలాగే నేలకొండపల్లి–రాజేశ్వరపురం గ్రామాల మధ్య చేపట్టిన తవ్వకాలను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఆర్‌అండ్‌బీ జేఈ దేవేందర్ ఉన్నారు.

'నీట్' ఫలితాలపై విచారణ జరిపించాలి

నేలకొండపల్లి: ఇటీవల వెల్లడైన నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్‌లో అనేక అవకతవకతలు జరిగాయని ఫలితాల ఆధారంగా తెలుస్తోందని చెప్పారు. ఈమేరకు అర్హులైన విద్యార్థులు నష్టపోకుండా ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని కోరారు. నాయకులు సోమనబోయిన సాయిన వీన్, రాయపూడి రోహిత్, పిట్టల రాజా, వడ్లమూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సాయిరాం	సత్యభామ
ఆదిత్య	రక్షణ, బ్యాడ్ బాయ్స్
శ్రీనివాస	బాజే వాయు వేగం, నం.1
సుందర్	లవ్ మౌళి

- ఖమ్మంగాంధీచౌక్

కంట్రోల్ తప్పుతోంది..!

నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వందలాది బస్సులతో రద్దీగా ఉండే ఖమ్మం పాత బస్టాండ్, మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వెళ్లే డిపో రోడ్డు ట్రాఫిక్‌తో అస్తవ్యస్తంగా ఉంటుంది. పాత బస్టాండ్‌లో వాహనాలు, ప్రయాణికుల రద్దీని కంట్రోల్ చేసేవారు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలు ప్లాట్‌ఫామ్‌ల వద్దకే వచ్చి వెళ్తుండడంతో బస్సుకు ఎక్కడ తగులుతాయోనని ఆర్టీసీ డ్రైవర్లు బెంబేలెత్తుతున్నారు. ఇక ఆటో వాళ్లకు ఆర్టీసీ అధికారులు బస్టాండ్ లోపల పార్కింగ్ ఇవ్వడంతో ఇదే అదునుగా వారు బస్సులకే అడ్డంగా వెళ్తూ ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఎగబడుతున్నారు. అలాగే అసలే ఇరుకుగా ఉండే డిపో రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేయడంతో ఏ పెద్ద వాహనం వచ్చినా ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఏదేమైనప్పటికీ కంట్రోల్ వ్యవస్థ గాడి తప్పడంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందనే విమర్శలు వస్తున్నాయి.

– ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరాపర్తినగర్



పాత బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌ల వరకు వచ్చిన ద్విచక్ర వాహనదారులు



బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద నిలిపిన ఆటోలు

పాత బస్టాండ్, డిపో రోడ్డులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- బస్టాండ్ ప్లాట్‌ఫామ్ వద్దకే ప్రైవేట్ వాహనాలు
- ఇన్, అవుట్ గేట్‌ల వద్ద అడ్డంగా ఆటోలు
- ప్రమాదాలకు నిలయంగా డిపో రోడ్డు
- కనిపించని కంట్రోల్ సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

ప్రైవేట్ వాహనదారుల ఇష్టారాజ్యం..

సిటీ బస్టాండ్‌గా ఉన్న పాత బస్టాండ్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులతో పాటు కోదాడ వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతుంటారు. అయితే ఈ బస్టాండ్‌లో తమ బంధువులను దింపేందుకు కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన వాహనదారులు ఇన్ గేట్, అవుట్ గేట్ ప్రాంతాల్లో దించకుండా నేరుగా ప్లాట్‌ఫామ్‌ల వద్దకే తీసుకొస్తున్నారు. ఈక్రమంలో కొందరు బస్సుల మధ్య నుంచే వెళ్తుండడం, మరి కొందర ప్లాట్‌ఫామ్ వద్దకు తీసుకొచ్చి నిలపడం చేస్తున్నారు. బస్టాండ్ లోపలకు, ప్లాట్‌ఫామ్ వరకు ప్రైవేట్ వాహనాలు రాకుండా చూడాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అడ్డా ఇచ్చినా.. అడ్డంగానే..

పాత బస్టాండ్‌లో ఇటు బస్సులకు, అటు ప్రయాణికులకు సరిపడా స్థలం లేకున్నా ఆర్టీసీ అధికారులు ఆటోలకు ఇన్ గేట్, అవుట్ గేట్ వద్ద అడ్డాలను ఇచ్చారు. ఇదే అదునుగా కొంత మంది ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలను గేట్ల ఎదుటే నిలపడం, బస్టాండ్ లోపలకు రానివ్వడంతో ఇటు బస్సులకు, అటు అవుట్ గేట్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఆటోలను నిలపకుండా చూడాల్సిన కంట్రోలర్లు, బస్టాండ్‌ను పర్యవేక్షించాల్సిన స్టేషన్ మేనేజర్ తమకు సంబంధం లేనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అసలే ఇరుకు.. ఆపై డివైడర్లు



జెండాల సెంటర్ వద్ద ట్రాఫిక్ జామ్

మయూరిసెంటర్ నుంచి డిపో రోడ్డు మార్గంగా రాపర్తినగర్‌కు వెళ్లే రోడ్డు నిత్యం ట్రాఫిక్‌తో అస్తవ్యస్తంగా తయారవుతోంది. అసలే ఈ రోడ్డు ఇరుకుగా ఉందనుకుంటే మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాక రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, మద్యం షాపులు ఉండడంతో వాహనదారులు షాపుల వద్ద రోడ్డుపైనే వాహనాలను ఆపుతున్నారు. దీనికితోడు డిపో నుంచి బస్సు రావడంతో ట్రాఫిక్ ఏర్పడి వాహనచోదకులను తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు గాని, ట్రాఫిక్ పోలీసులు గాని తగిన చర్యలు తీసుకోవడంతో విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలతో ఇబ్బంది..

ఖమ్మం పాత బస్టాండ్‌లో ఇద్దరు కంట్రోలర్లు మాత్రమే ఉన్నారు. రాత్రి వేల డ్యూటీలో ఒక కండక్టర్‌ను ఓడీ ఇచ్చారు. ఆటోలను లోనికి తీసుకురావొద్దని చెబుతున్నా మా మాట వినడం లేదు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలను కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– రామకృష్ణ, స్టేషన్ మేనేజర్, ఖమ్మం పాత బస్టాండ్

డివైడర్లు తొలగించాలి..



అసలే ఇరుకు రోడ్డు ఆపై బస్ డిపో ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రోడ్డులో డివైడర్లు వేయడం వల్లే ఇంత ట్రాఫిక్ ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపుల షాపుల వద్ద వాహనాలు నిలపడం కూడా ఇందుకు ఓ కారణమని చెప్పొచ్చు. తక్షణమే మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎ. ఉపేందర్, ఖమ్మం

బస్ డిపోను మార్చాలి..



ఈ రోడ్డు మార్గంలో ఉన్న బస్ డిపో నుంచి నిత్యం బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. బస్ డిపోను వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలి లేదా రోడ్డుకు అడ్డంగా నిలిచిన డివైడర్లను తొలగించాలి. అయితే పగలు కంటే రాత్రి సమయాన అధికంగా ట్రాఫిక్ ఉంటుంది. మున్సిపల్ అధికారులు స్పందించే బాగుంటుంది.

– పోటు నాగేశ్వరరావు, ఖమ్మం

పొంచి ఉన్న ప్రమాదం..

పాత బస్టాండ్‌లో ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది ప్రయాణికులు పలు పనులపై పాత బస్టాండ్‌కు వచ్చి వెళ్తుంటారు. ఈక్రమంలో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు బస్సుల మధ్యలోకి వాహనాలను తీసుకొచ్చి పెడుతుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని బస్సు డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బస్సులను ప్లాట్‌ఫామ్ నుంచి వెనుకకు తీసే సమయాన ప్రమాదం పొంచి ఉందని ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. అలాగే డిపో రోడ్డులో డివిడర్లు ఏర్పాటు చేయడం వల్లే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. డివైడర్లను తొలగిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానికులు, వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో నిలుస్తున్నాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరింత శ్రమించి పాఠశాలలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈనేపథ్యాన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై అశ్రద్ధ వీడి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యపు పెంచాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ ప్రధానిగా ఉంటేనే దేశాభివృద్ధి..

కామేపల్లి: ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి జరుగుతుందని ప్రజలు మరోసారి బీజేపీకి పట్టం కట్టారని బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు అన్నారు. గోవింద్రాల గ్రామానికి చెందిన బాదావత్ రాజేష్ ఆధ్వర్యాన 25 మంది యువకులు బీజేపీలో చేరగా.. వారికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతీ బీజేపీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాగం రంగారావు, భూక్యా శ్రీనునాయక్, పోలూరి చంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య, జాలె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంవైద్యవిభాగం: నిత్యం వేలాది మంది చికిత్స కోసం వచ్చే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు వై.విక్రమ్ ఆధ్వర్యాన నాయకులు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌ను కలిసి సమస్యలు వివరించారు. వైద్యులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, వైద్యులు సమయానుకూలంగా విధులు నిర్వర్తించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడపట్ల సుదర్శన్, జె.వెంకన్న బాబు, ఇఏ.బద్రం, నాగేశ్వరరావు, పి.వాసు, మల్లికార్జున్‌రెడ్డి, ఏ.కృష్ణ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లకు..

నిరుపేదలు వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తే టెస్ట్‌లు కొన్ని మాత్రమే చేసి మిగతా వాటి కోసం ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్నారని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్.ప్రదీప్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి ఆరోపించారు. పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధి బృందం శనివారం ఆస్పత్రిలో పర్యటించి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. స్కానింగ్ రేడియాలజిస్ట్ లేదని రోజుకు 50 మందికే స్కానింగ్ తీసి, మిగతా వారిని పంపిస్తున్నారని చెప్పారు. ఇకనైనా పేదలు ఇబ్బంది పడకుండా అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు సరిపడా మందులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోకినపల్లి లలిత, నాయకులు ఝాన్సీ, శోభ, ఎస్.వీ.రాకేష్, సురేష్, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రథమ బహుమతి అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: కూసుమంచిలో నిర్వహించిన పాలేరు నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో కూసుమంచికి చెందిన నేస్తం వెల్ఫేర్ సొసైటీ టీం ప్రథమ బహుమతిని సాధించింది. ద్వితీయ, తృతీయ బహుమతులను వెంకట్ లెవన్స్, షోయబ్ లెవన్స్ టీంలు గెలుచుకోగా.. విజేతలకు శనివారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.25,116లను కాంగ్రెస్ నాయకులు కొర్రా రమేష్, ద్వితీయ బహుమతి రూ.20,116లను అయ్యప్ప ట్రేడర్స్, తృతీయ బహుమతి రూ.10,116లను శ్రీ సాయి న్యూరో ఆస్పత్రి వారు సమకూర్చగా దాతలను అభినందించారు.

'ఉపాధి'ని సమగ్రంగా అమలు చేయాలి

తిరుమలాయపాలెం: వ్యవసాయ కూలీల ఉపాధి హామీ పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తిరుమలాయపాలెంలో ఉపాధి హామీ కూలీలను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రెక్కల కష్టంపై ఆధారపడిన గ్రామీణ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా నిర్వహించడంలేదన్నారు. 100 రోజులు జరగాల్సిన పనిని కేవలం 50, 60 రోజులు మాత్రమే పని కల్పిస్తూ పేదల పొట్ట కొడుతున్నారని తెలిపారు. పేదలకు ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న హైదరాబాద్‌లో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు నెర్సుల వెంకటేష్, కొమ్ము వెంకన్న, బొజ్జ ముత్తయ్య, ఎస్.రాము, కొమ్ము నాగేశ్వరరావు, మహిళా కూలీ నాయకురాళ్లు ఉపేంద్ర, జయమ్మ, సునీత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు చట్టపరంగా రక్షణ కల్పించాలని వీరనారి సావిత్రి బాయిపూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పీఆర్ దేవి డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో జిల్లా నాయకురాలు సత్యావతి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. తెలిసీతెలియని వయసులో వివాహాలు చేసినప్పుడు భార్యభర్తల మధ్య అవగాహన లేక కుటుంబ కలహాలు ఏర్పడి వారి పిల్లల పోషణ భారం అంతా మహిళలపై పడుతుందన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు, రేషన్ కార్డులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మణి, అనంతలక్ష్మి, ఈశ్వరి, కె.లక్ష్మి, సునీత, వినోద, ధనలక్ష్మి, మంగమ్మ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో చెన్నారం రైతు



సదస్సులో మంత్రి తుమ్మలతో రామకృష్ణ

నేలకొండపల్లి: హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన 2020–24 గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన మంకెన రామకృష్ణ అనే రైతు పాల్గొన్నారు. రైతు ప్రతినిధిగా జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం కల్పించడంతో శనివారం సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈనేపథ్యాన సమ్మిట్‌లో హైబ్రిడ్, ఆర్గానిక్ పంటల సాగులో మెళకువలు తెలుసుకున్నానని రామకృష్ణ తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



రాజేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండకు చెందిన కలకోట రాజేష్‌కుమార్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ కుమారుడైన రాజేష్ గత మార్చిలో జరిగిన రుబిక్స్ క్యూబ్ పోటీల్లో పాల్గొని 39.3 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సన్మానించి పతకం అందించారు.

పాలకులు నాణ్యమైన పాలన అందించాలి

ఖమ్మంరూరల్: ప్రజలచే ఎన్నుకోబడిన పాలకులు ప్రజల సంక్షేమం కోసం పని చేస్తూ జనరంజకమైన పాలన అందించినప్పుడే ప్రజల మనస్సు చూరగొంటారని సీపీఎం జిల్లాకార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్లే ఎన్నికల్లో ఆపార్టీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారని తెలిపారు. కేంద్రంలో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో వివిధ రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో కాలంలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు నండ్ర ప్రసాద్, బుగ్గవీటి సరళ, వి.సుదర్శన్‌రెడ్డి, టుకూరి ప్రసాద్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, పి.వెంకటరమణ, వి.నాగేశ్వరరావు, కారుమంచి గురవయ్య, భూక్యా కృష్ణ, పి.సంగయ్య, ఎన్.మంగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

రామోజీరావుకు పలువురి నివాళి

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం సహకారనగర్/ఖమ్మంమామిళ్లగూడెం: ఈనాడు పత్రిక, రామోజీ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఈమేరకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, కమ్మ మహాజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్నేని రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్.సాగర్, నాయకులు నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాద్ వేర్వేరుగా సంతాపం తెలిపారు. కాగా, హైదరాబాద్‌లో రామోజీరావు మృతదేహం వద్ద మంత్రులు తుమ్మల, పొంగులేటి నివాళులర్పించారు. అలాగే, ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం రామోజీరావు చిత్రపటం వద్ద టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యాన నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టెకోల రాంనారాయణతో పాటు ఏనుగు వెంకటేశ్వరావు, మాటేటి వేణు, పర్వతనేని వెంకట్రావు, ఆవుల శ్రీనివాసరావు, నలజాల వెంకట్రావు, మైసా పాపారావు, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శివ, కె.గోపి తదితరులు పాల్గొన్నారు. ఇక రామోజీరావు మృతిపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, వివిధ సంఘాల బాధ్యులు వడ్డెబోయిన నర్సింహారావు, దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాకృష్ణ, లింగాల రవికుమార్, మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి కూడా సంతాపం ప్రకటించారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు

'కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు కుట్ర'

కూసుమంచి: కార్మికులు తమ హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలు కొనసాగించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకన్న, కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం పాలేరులో నిర్వహించిన ఇఫ్టూ పాలేరు ఏరియా రెండో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల చట్టాల సవరణ పేరుతో కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. దీన్ని కార్మికులు తిప్పికొట్టి చట్టాల సవరణను అడ్డుకునేందుకు పోరాటాలు సాగించాలన్నారు. ఆటో, మోటారు వాహన రంగ కార్మికులకు చట్టబద్ధత కల్పించాలని, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, ఆశా తదితర మహిళా కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో గ్రామంలో ర్యాలీ తీశారు. గోసు పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, నాయకులు వెంకటేశ్వర్లు, రామదాసు, రోషయ్య, లెనిన్, ఉపేందర్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, గురువారెడ్డి, నామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మీకోసమే తెచ్చినం..

మృగశిర కార్తె.. రోజుచేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. వర్షాకాలం తొలకరి షురువవుతున్న తరుణంలో చేపలు తినాలని.. ఒంట్లో వేడి పోయేందుకు మీనాలను ఆరగించాలని.. ఇలా రకరకాల కారణాలతో మృగశిర కార్తె రోజు చేపలు తింటున్నారు. ఈనేపథ్యాన వ్యాపారులు శుక్రవారం రాత్రే ఆంధ్రా నుంచి సైతం చేపలను తెప్పించి శనివారం ఉదయం నుంచి విక్రయాలు ప్రారంభించారు. దీంతో ఎటు చూసినా మీనాలే కనిపించాయి. ప్రజలు కూడా ధర ఎక్కువైనా కొనుగోలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం త్రీటౌన్ మార్కెట్‌లో చేపల విక్రయాలు



తిరుమలాయపాలెంలో చేపలు పడుతున్న దృశ్యం



ప్రకాష్‌నగర్ రోడ్డులో..



నేలకొండపల్లిలో చేపల విక్రయాలు